నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 18 జనవరి 2025 | ADILABAD NIRMAL



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# హక్కుల కోసం ఉద్యమించాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం,జనవరి17: ఐక్యంగా ఉండి హక్కుల కోసం ఉద్యమిస్తే ఏ ప్రభుత్వమైనా దిగి వస్తుందని మున్సిపల్ కార్మికులకు మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 3వ సభను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ సభ స్థలి వరకు ర్యాలీగా వచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ మంత్రి జోగు రామన్న, ఏఐటీయూసీ నాయకులతో హాజరై అభివాదం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ... తాను గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినప్పుడు మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి శాయాశక్తులా కృషి చేశానని తెలిపారు. అధికారంలో లేకపోయినా కార్మికులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసు రత్నం మాట్లాడుతూ...రాష్ట్రంలో అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను విస్మరించిందన్నారు. పట్టణాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, వేతన సవరణ చేయాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కర్ణాటక, మద్రాస్, కేరళ తరహాలో ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనంపల్లి జైపాల్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఫయాజ్, మల్లేశ్, ముత్యం, పొశెట్టి, బీఆర్ఎస్ నాయకులు రాజన్న, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

# ఉచిత కరెంటు ఇస్తలేరు

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు**

ఎదులాపురం,జనవరి 17: గత కేసీఆర్ ప్రభుత్వం రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ ఇచ్చిందని, కానీ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ బిల్లులు చెల్లించాలని అధికారులు అంటున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. ఆదిలాబాద్‌లో ఇటీవల సంటెన్న ఇస్త్రీ షాపు అగ్ని ప్రమాదంలో దగ్ధమవడంతో బాధితుడికి శుక్రవారం బీసీ సంఘం భవనంలో రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులు, రజకులకు ఉచిత విద్యుత్ ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నదన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగితే పరిహారం కూడా అందడం లేదన్నారు. బిల్లులు కూడా వస్తున్నాయని దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బిల్లులను మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్, అశోక్, రాజు, సత్యనారాయణ, నర్సింహులు, ప్రశాంత్, సంతోష్, వినోద్, జక్కుల దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# బోథ్ నియోజకవర్గానికి ప్రత్యేక కోటా కేటాయించాలి

ఇచ్చోడ, జనవరి 17 : బోథ్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రత్యేక కోటా ఇచ్చి నియోజకవర్గాభివృద్ధికి సహకరించాలని మంత్రి సీతక్కకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువ ఉన్నాయన్నారు. గిరిజనేతరులు ఏజెన్సీలో పోడు వ్యవసాయం చేస్తున్నారన్నారు. వారికి ఎలాంటి హక్కులు, రైతు భరోసా పథకాలు అందడం లేదన్నారు. ఇప్పటి వరకు రేషన్ కార్డుల జాబితాల్లో చాలా పేర్లు గల్లంతయ్యాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతరులకు ఏ విధంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తారో మంత్రి సీతక్క స్పష్టత ఇవ్వాలన్నారు.

# ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

ఎదులాపురం, జనవరి 17 :ఆదివాసీల సమస్యల పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆదివాసీల రిజర్వేషన్ తొలగించడంపై నిరసనగా, ఆదివాసీ చట్టాలు అమలు చేయాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీల అభివృద్ధి విద్య, వైద్యం, భూములకు పట్టాలు, ఉద్యోగ కల్పన, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న చలో హైదరాబాద్ చేపట్టినట్లు తెలిపారు. ఇందిరా పార్క్ ఎదుట జరిగే ఆదివాసుల మహాగర్జనకు ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆదివాసీల హక్కులను తొలగించడం, ఆదివాసీ చట్టాలను నీరుగార్చడం, అడవుల ప్రైవేటీకరణ పేరుతో నూతన అటవీ చట్టం తీసుకువచ్చి ఆదివాసీల గ్రామసభ 1/70, 5వ, 6వ షెడ్యూల్ హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆదివాసీల రిజర్వేషన్ క్రమంగా తగ్గించడం, ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతుల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టి గిరిజన రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నదని విమర్శించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఐటీడీఏల స్వయం ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారిందని, క్రమంగా నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం ఆదివాసీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోవ శకుంతల, మంజుల, నాయకులు స్వామి, ఆశన్న, మోహన్ ఉన్నారు.

# నేడు నవోదయ పరీక్ష

**హాజరు కానున్న 5191 మంది విద్యార్థులు**

ఎదులాపురం,జనవరి 17: 2025-26 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు గాను ఇప్పటికే విద్యాలయ సమితి అన్ని జిల్లాల్లోని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్‌నగర్‌లో ఉంది. రాబోయే విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి గాను ఆగస్టు నెలలోనే విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 5191 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా వారికి కోసం 24 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఉదయం 11:30 గంటల నుంచి 1:30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఇప్పటికే హాల్ టికెట్లను ఆన్‌లైన్ పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్షకు సంబంధించిన వివరాలను డీఈవో ప్రణీత వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1170 మంది విద్యార్థులకు గాను 5 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గర్ల్స్ హైస్కూల్, లిటిల్ ఫ్లవర్, చావర అకాడమితో పాటు ఇచ్చోడ, ఉట్నూర్‌లో కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షల సూపరింటెండెట్లు, పరిశీలకులను కూడా నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆలస్యమైతే కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

# రిమ్స్‌లో కలెక్టర్ తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు

ఎదులాపురం, జనవరి 17 : రిమ్స్ దవాఖానలో శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కలెక్టల్ తల్లి అమితా షాకు దంత పరీక్షలు, తండ్రి బీకే షాకు కంటి పరీక్షలు చేయించుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కలెక్టర్ తల్లిదండ్రులను దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు.


దంత పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ తల్లి అమితా షా

# కొందరికే రేషన్ కార్డులు!

**గ్రామాల్లో రూ. లక్షన్నర, పట్టణాల్లో రూ.రెండు లక్షల ఆదాయముంటేనే ఇస్తరట**

- పదేళ్లక్రితం నాటి నిబంధనలు.. ఇప్పుడు అమలు చేయడంపై విమర్శలు
- 65 ఏండ్లు ఉన్నోళ్లు కూడా అర్హులేనట.. మరి 57 ఏళ్లున్నవారికి ఇక పింఛన్ ఇవ్వరా?
- సర్కారు తీరుపై ప్రజల్లో అనేక అనుమానాలు
- లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకేనంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలు




మంచిర్యాల, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రూ. 2 లక్షల లోపు రుణమున్న రైతులందరికీ మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ కొందరికే అవకాశమిచ్చింది. గెలిస్తే రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి.. ఇప్పుడేమో రూ.12 వేలే అంటున్నది. ఇలా ఆచరణ సాధ్యం కాని అనేక హామీలిచ్చి రైతులను బోల్తా కొట్టించిన సర్కారు, ఇక ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జారీలోనూ అడ్డగోలు కొర్రీలు పెట్టి లబ్ధిదారులను తగ్గించాలని చూస్తున్నది. ఎప్పుడో 2014లో రూపొందించిన నిబంధనలే ఇప్పుడు వర్తింపజేయాలనుకుంటుండగా, అనేక మంది అనర్హులుగా మారే అవకాశమున్నది.

**పదేళ్లలో కుటుంబ ఆదాయం పెరిగింది**

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గైడ్‌లైన్స్ ప్రకారం.. ఫుడ్ సెక్యూరిటీ (రేషన్) కార్డులకు కుటుంబాల ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉండకూడదు. 2014లో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఆదాయ పరిమితి (సీలింగ్ లిమిట్)ని నిర్ణయించారు. కానీ ఇప్పుడు దాదాపు పదేళ్లు (2025) పూర్తయ్యాక కూడా ఇంకా 2014 ఉత్తర్వులనే వర్తింప చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదేళ్ల క్రితం నెలకు రూ.10 వేలు సంపాదించిన కుటుంబం ఇప్పుడు నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నది. ఈ లెక్కన రేషన్ కార్డు పొందేందుకు అనర్హులవుతారు. ఇక భూముల విషయానికి వస్తే పొలమైతే రెండున్నర ఎకరాలు, ఇతర సాగుభూములైతే ఐదు ఎకరాల్లోపు ఉండాలి. గవర్నమెంట్, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులతో పాటు డాక్టర్లు, కాంట్రాక్టర్లు అనర్హులు. గవర్నమెంట్ పింఛన్‌దారులు, ఫ్రీడమ్ ఫైటర్ పింఛన్‌దారులకు రేషన్ కార్డు రాదు. కారు కలిగి ఉన్న కుటుంబం సైతం రేషన్‌కార్డు పొందేందుకు అర్హులు కారు. మిగిలిన నిబంధనలు ఎలా ఉన్నా ఆదాయ పరిమితిపై 2014 ఉత్తర్వులనే అమలు చేయడంతో వేలాది మంది ఫుడ్ సెక్యూరిటీ కార్డుకు దూరం కానున్నారు.

**పింఛన్ వయసు పెంచుతారా..**

గతంలో బీఆర్ఎస్ సర్కారు ఆసరా పింఛన్ పొందే వయసును 57 సంవత్సరాలకు కుదించింది. మానవతా దృక్పథంలో ఆలోచించి తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది వృద్ధులు పింఛన్లకు అర్హులయ్యారు. కాగా, ఇప్పుడు రేషన్ కార్డు 65 ఏళ్లలోపు ఉన్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇది కూడా 2014లో తీసుకొచ్చిన నిబంధనే. కానీ గత సర్కారు పింఛన్ వయసు 57 ఏళ్లకు తగ్గించింది. మరి ఇప్పుడు పింఛన్ వస్తున్న వారిలో 65 ఏళ్లలోపు వారు చాలా మంది ఉన్నారు. వారంతా ఇప్పుడు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక వేళ వృద్ధాప్య పింఛన్‌లకు సైతం ఇదే 65 ఏళ్ల నిబంధనల వర్తింప చేస్తే అటు రేషన్ కార్డులతో పాటు ఇటు పింఛన్‌లకు చాలా మంది దూరమయ్యే ప్రమాదాలు ఉన్నాయి. అంటే 57 ఏళ్లకే ఇప్పుడు వస్తున్న వృద్ధాప్య పింఛన్ ఇకపై రాదా అన్న సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి.


మంచిర్యాల జిల్లా భీమారంలో అర్హులైన వారికే రేషన్‌కార్డులు ఇవ్వాలని అధికారులను కోరుతున్న స్థానిక యువకులు

**వెరిఫికేషన్‌లో ఇష్టారాజ్యానికి ఛాన్స్...**

ఆదాయ పరిమితులు, ఆసరా పింఛన్ల విషయంలో క్లారిటీ రావాల్సి ఉండగా, ఇక రేషన్ కార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోకపోవడం, వెరిఫికేషన్ అధికారం రెవెన్యూశాఖకు కాకుండా స్థానిక సంస్థల అధికారులకు ఇవ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్‌కార్డుల కోసం అనేక మంది కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్నారు. రేషన్‌కార్డులు ఇస్తారు అనగానే ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి. ఎలా చేసుకోవాలని అడుగుతున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఎలాంటి దరఖాస్తులు తీసుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిన సోషియో-ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, పొలిటికల్ అండ్ క్యాస్ట్ సర్వే చేశారు. అప్పుడు రేషన్‌కార్డు ఉందా.. లేదా అన్న వివరాలు సైతం సేకరించారు. అంతకు ముందు ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో సేకరించిన వివరాల మేరకు రేషన్‌కార్డులకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెబుతున్నారు. అంటే ప్రత్యేకంగా దరఖాస్తులేవి చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పటికే అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో రేషన్‌కార్డులు కావాల్సిన కుటుంబాల జాబితా సిద్ధమైపోయింది. కాకపోతే దీన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఇలా కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎప్పుడు ఇచ్చిన దరఖాస్తులు, సర్వే ఆధారంగా జాబితాను ఫైనల్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పైగా రేషన్‌కార్డుల వెరిఫికేషన్ చేసే బాధ్యత గతంలో రెవెన్యూ అధికారులపై ఉండేది. కానీ ఇప్పుడు పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో కమిషనర్‌కు అప్పగించారు. దీంతో అక్రమాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జనాలు ఆరోపిస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నాక కూడా రిజెక్ట్ చేసే అధికారం ఈ అధికారులు ఇవ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి.. వచ్చిన దరఖాస్తులపై ఎంక్వైరీ చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ముఖ్యంగా 2014 నిబంధనల్లో మార్పు చేసి ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా నిబంధనలు రూపొందించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. మరి ఈ వ్యవహారం అధికారులు ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

# గంగాజలంతో తిరుగుపయనం

జన్నారం /దస్తూరాబాద్ జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో ఈ నెల 28న నిర్వహించే నాగోబా జాతరకు గంగాజలాన్ని తీసుకెళ్లేందుకు 150 మంది మెస్రం వంశస్తులు శుక్రవారం పాదయాత్రగా తరలివచ్చారు. జన్నారం మండలం కలమడుగు గ్రామ సమీపంలోని గోదావరి రేవులోగల హస్తినమడుగుకు చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి గోదావరికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఝరిలో గోదావరి జలాలను సేకరించి తిరుగుపయనమయ్యారు. శుక్రవారం రాత్రి ఉడుంపూర్‌కు చేరుకొని అక్కడ రెండు గంటలు బసచేసి ఆపై ఉట్నూరు చేరుకున్నారు. ఈ నెల 28న జరిగే నాగోబా జాతరకు హాజరవుతామని, గంగాజలంతో నాగోబాకు అభిషేకం చేసి జాతరను ప్రారంభిస్తామని ఆలయ పూజారి మెస్రం కోసరావు తెలిపారు.



గంగాజలంతో తిరుగు పయనమవుతున్న మెస్రం వంశీయులు

# కర్షకుల కన్నెర్ర

**రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్**

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఈ నెలాఖరులోగా స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : రూ. 2 లక్షలోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు కన్నెర్ర చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ ఆదివాసీ జిల్లాలో రుణమాఫీ సక్రమంగా అమలు కాలేదని, ఇందుకు కారకులైన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు రుణమాఫీ కాలేదని మండిపడ్డారు. ఆదివాసీ బిడ్డ, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని రైతులందరికీ వెంటనే రుణమాఫీ అయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 31లోగా సర్కారు దిగిరాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొరెంగ మాలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కోట. శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మాడవి గణపతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయి కృష్ణ, డీవైఎఫ్ఐ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ చాపిడి శ్రావణి, జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, టీఏజీఎస్ నాయకులు మరప హన్మంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు


ఆదిలాబాద్‌లో లేబర్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

# 'ఓరియంట్' ఎన్నికలు నిర్వహించాలి

- మెజార్టీ యూనియన్ల అభిప్రాయం
- వాయిదా వేయాలని కోరిన యాజమాన్యం
- ఈ నెల 28న ఫైనల్ అయ్యే అవకాశం

కాసిపేట, జనవరి 17 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై శుక్రవారం ఆదిలాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజశ్వరమ్మ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి మెజార్టీ నాలుగు యూనియన్ల తరుపున ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం ఓరియంట్ సిమెంట్ కంపెనీని అదానీ గ్రూపులు కొనుగోలు చేయడంతో యాజమాన్యం మార్పు పక్రియ కొనసాగుతుండగా, ఎన్నికలు వాయిదా వేయాలని ఓరియంట్ యాజమాన్యం తరుపున అధికారులు కోరారు. ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ యూనియన్లు కోరాయి. ఒక యూనియన్ ఉద్యోగుల సంతకాలతో కూడిన ప్రాతినిధ్య పత్రాలను సమర్పించారు. సమావేశానికి హాజరైన ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, ది లోకల్ ఓరియంట్ సిమెంట్స్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాలుగు యూనియన్ల ప్రతినిధులు హాజరు కాగా, మెజార్టీ నాయకులు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 28న మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అదే రోజున తుది నిర్ణయం వెలువడే అవకాశమున్నది. ఇప్పటికే గుర్తింపు సంఘం ఎన్నికలు లేక మూడేళ్లు అవుతుండగా, ఎలాగైనా ఎన్నికలు నిర్వహించాలని ఓరియంట్ కార్మికులు కోరుతున్నారు.